పట్టణానికి దూరంగా.. నిరుపయోగంగా



బైపాస్ వద్ద పంటపొలాల పక్కన ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనం, చిల్డ్రన్‌పార్క్

కోదాడ : కోదాడ మున్సిపాలిటీ అధికారులు ముందు చూపు లేకుండా లక్షల రూపాయల ప్రజాధనంతో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనం, చిల్డ్రన్ పార్క్ నిరుపయోగంగా మారాయి. చిల్డ్రన్‌పార్క్‌ను పట్టణానికి దూరంగా పంటపొలాల వద్ద ఏర్పాటు చేయడంతో అక్కడకు వెళ్లేవారే లేరు. దీంతో లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు, ఆట వస్తువులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పు పట్టిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో విజయవాడ- హైదరాబాద్ బైపాస్ రోడ్డుకు సమీపంలో ఏర్పాటు చేసిన ఒక వెంచర్‌లో సామాజిక అవసరాల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇచ్చిన 10 శాతం స్థలంలో పట్టణ ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. దీని కోసం రూ.5 లక్షల ఖర్చు చేశారు. ఆ తరువాత దానిలోనే ఒక పక్కన మరో రూ.10 లక్షలు ఖర్చు చేసి చిల్డ్రన్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. అది పట్టణానికి దూరంగా ఉండడంతో పాటు దానికి కిలోమీటర్ దూరం వరకు నివాసాలు లేకపోవడంతో అక్కడికి పిల్లలు ఎవ్వరూ వెళ్లడం లేదు. ఇక దీని చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ తెగిపోయింది. దీనిలో నాటిన ఒక్క మొక్క కూడా బతకలేదు. ఈ ఒక్క పట్టణ ప్రకృతి వనమే కాదు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 35 వార్డులలో కోట్ల రూపాయల ఖర్చుతో ఏర్పాటు చేసిన 35 పట్టణ ప్రకృతి వనాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

‘డబుల్’ కాలనీల్లో వసతులు కరువు



విభళాపురంలో బురదమయంగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీకి వెళ్లే దారి

మోతె : మండల కేంద్రంతో పాటు విభళాపురం, అప్పన్నగూడెం గ్రామాల్లో గల డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. విద్యుత్, రోడ్లు, తాగునీటి సౌకర్యాలు లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లను ఏడేళ్ల క్రితం నిర్మించి నాలుగేళ్ల క్రితం పంపిణీ చేశారు. కానీ వసతులు కల్పించలేదు. దీంతో మరుగుదొడ్లు, డోర్ల మరమ్మతులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో విషపురుగుల సంచారంతో వీధిలైట్లు లేక రాత్రి వేళలో ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే బయపడుతున్నారు. ఇక వర్షాకాలంలో ఇళ్ల ముందు నీరునిల్వ ఉండి దోమలు, ఈగలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు వినతులు ఇచ్చిన పట్టించుకోవడం లేదని ఇళ్లు పంపిణీ చేసిన నాటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు అటు వైపు కన్నెత్తి అయినా చూడలేదని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీల్లో వీధిలైట్లు, రోడ్లు, డ్రెయినేజీ, తాగు నీటి సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు.

మాయమాటలు చెప్పేటోళ్లను నమ్మొద్దు

● మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

అనంతగిరి : స్థానిక సంస్థల ఎన్నికల్లో మాయమాటలు చెప్పేటోళ్లను నమ్మి ఓట్లు వేయొద్దని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఓట్లు వేసి మోసపోయి ప్రజలను చైతన్యం చేయాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్ర ప్రజల బతుకులు మార్చేందుకు కేసీఆర్ 14 సంవత్సరాలు పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిపుచ్చుకున్నామని అన్నారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. ప్రతిఒక్కరూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నల్లా భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుగులోతు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎండి అఫ్జల్, మట్టపల్లి పుల్లయ్య గౌడ్, పి.వీరయ్య, ఐతనబోయిన వెంకటేశ్వర్లు, మట్టపల్లి సైదులు, రాజగోల్‌పాల్‌రెడ్డి, వెంకటప్పయ్య, మోజెస్, బోస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

నడిగూడెం : గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం నడిగూడెంలోని శ్రీ కొల్లు పాపయ్య చౌదరి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి క్రికెట్ పోటీల విజేతలకు శుక్రవారం ఆయన నగదు బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని, ఐక్యతకు దోహదపడతాయన్నారు. కాగా, పోటీల్లో ప్రథమ బహుమతిని నడిగూడెం మండలం ఎకలాస్‌ఖాన్‌పేట తండా, ద్వితీయ బహుమతి లిటిల్ స్టార్ యూత్, తృతీయ బహుమతి గరిడేపల్లి మండలం పొనుగోడుకు చెందిన జోగు పిచ్చిరెడ్డి మెమోరియల్ జట్లు గెలుచుకున్నాయి. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ పందిటి క్రాంతికుమార్, నడిగూడెం మాజీ సర్పంచ్ దున్నా సుధాకర్, నిర్వాహకులు గంటెపంగు సుదీప్, పందిటి శ్యామ్, పందిటి వంశీ, శ్యామ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు భోనగిరి ఉపేందర్, బొల్లం శ్రీను, డాక్టర్.సైదులు, మేకల గంగరాజు, ఎండీ. రఫీ, బుడేమియా, తదితరులు పాల్గొన్నారు.

దామోదర్‌రెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు



మౌనం పాటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోదాడ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు అన్నారు. దామోదర్‌రెడ్డి మృతికి సంతాపంగా శుక్రవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు మౌనం పాటించి మాట్లాడారు. దామోదర్‌రెడ్డి.. ఎమ్మెల్యేగా, మంత్రిగా జిల్లాకు అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఏర్నేని బాబు, పారా సీతయ్యతో పాటు గందం యాదగిరి, బాల్‌రెడ్డి, లైటింగ్ ప్రసాద్, పాలూరి సత్యనారాయణ, పిడతల శ్రీను, బాగ్దాద్, బాజాన్, మాతంగి బసవయ్య, గంధం పాండు, మస్తాఫా, గుండెల సూర్యనారాయణ, షఫి, పుల్లయ్య, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న దుర్గామాత అమ్మవారి శోభాయాత్ర శుక్రవారం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లు, కోలాట ప్రదర్శనల నడుమ అమ్మవారి విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



కోదాడ : బ్రహ్మంగారి గుడి వద్ద నుంచి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



మేళ్లచెరువు : రామాపురంలో..



చిలుకూరులో..



పాలకవీడు : మూసీఒడ్డుసింగారంలో..

గీతాంజలి యూత్ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ ఎన్నికలో పాల్గొన్న గీతాంజలి యూత్ సభ్యులు

నాగారం : నాగారం గ్రామంలో గత 25 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గీతాంజలి యూత్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గీతాంజలి యూత్ గౌరవ అధ్యక్షుడిగా కత్తుల వెంకన్న, నూతన కమిటీ అధ్యక్షుడిగా కన్నేబోయిన లింగమల్లు, ఉపాధ్యక్షులుగా కన్నేబోయిన బుచ్చిబాబు, వేల్పుల మహేష్, ప్రధాన కార్యదర్శిగా బకతట్ల కొమరెల్లిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు రామకృష్ణ, సుదర్శన్, వంగూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



హుజూర్‌నగర్ : బూరుగడ్డలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



మోతె : గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని హుజూర్‌నగర్ పట్టణంలో, మండలంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాలలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

పట్టణంలో గాంధీ జయంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మునగాల మండలంలో..

మునగాల : మండలంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వాసవీ క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ పార్క్ వద్ద గాంధీ విగ్రహానికి, ఎంపీడీఓ కార్యాలయంలో వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ వంగవేటి వెంకటగురుమూర్తి పాల్గొని నివాళులుర్పించారు. కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ అధ్యక్షుడు అర్వపల్లి ప్రవీణ్, కందిబండ సంతోష్, బ్రహ్మదేవర అఖిల్, ఆర్యవైశ్య పెద్దలు నల్లపాటి శ్రీనివాస్, కందిబండ సత్యనారాయణ, చిల్లంచర్ల ప్రభాకర్, కందిబండ మంగేష్, చక్కా కిశోర్, ప్రహాస్, యశ్వంత్, నితిన్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, ఉప్పుల జానకిరెడ్డి, గంధం సైదులు, కొమ్ము ఈదారావు, మండవ శ్రీనివాస్‌గౌడ్ లక్ష్మయ్య గౌడ్ పాల్గొన్నారు.

మోతె మండలంలో..

మోతె : మోతె మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మునగాల : వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ..

చిలుకూరులో..

చిలుకూరు : చిలుకూరు మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయం, చిలుకూరు బాపూజీ శాఖా గ్రంథాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గురువారం జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చైర్మన్ గరిణె శేషగిరిరావు, గ్రంథాలయం మాజీ చైర్మన్లు, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు, సర్పంచ్, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిలుకూరు : బాపూజీ శాఖా గ్రంథాలయంలో..



మునగాలలో..

ఆనందోత్సాహాలతో విజయదశమి సంబరాలు



కోదాడ : నయానగర్‌లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



నేరేడుచర్ల : శ్రీవిజయదుర్గ ఆలయంలో జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న ప్రముఖులు



గరిడేపల్లి : కీతవారిగూడెంలో శమీ పూజలో పాల్గొన్న గ్రామస్తులు



మోతె : నామవరంలో..



హుజూర్‌నగర్ : బూరుగడ్డలో శమీ పూజలో పాల్గొన్న అర్చకులు, గ్రామ పెద్దలు



మఠంపల్లి : మట్టపల్లి ఆలయంలో ..



మేళ్లచెరువు : శివాలయంలో..



గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్ఐ నరేష్, సిబ్బంది



మునగాల : అయ్యప్ప దేవాలయంలో శమీ పూజలో పాల్గొన్న గ్రామపెద్దలు



చిలుకూరు : జమ్మిచెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు



నడిగూడెం : సిరిపురం శ్రీ కోదండరామస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

కనుల పండువగా కనకదుర్గమ్మ జాతర



ప్రభబండ్ల ఊరేగింపులో గ్రామస్తులు



ద్విచక్ర వాహనంపై ప్రభను అమర్చి తీసుకెళ్తున్న బాలుడు

మునగాల : మండల కేంద్రంలో శుక్రవారం కనకదుర్గమ్మ జాతరను కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి కనకదుర్గ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సుమారు వంద ట్రాక్టర్లపై ప్రభలు అమర్చి పుర వీధుల్లో ఊరేగింపు జరిపారు. శుక్రవారం ఉదయం ప్రభబండ్లు కనకదుర్గ దేవాలయానికి చేరుకున్న తర్వాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ దుర్గమ్మ తల్లిని మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు గ్రామస్తులు వనవాసం వెళ్లారు. జాతర సందర్భంగా గ్రామంలో మాంసం, మద్యం దుకాణాలు కిటకిటలాడాయి. ఆడపడుచులు, బంధుమిత్రుల రాకతో పండుగ వాతావరణం నెలకొన్నది.

క్లుప్తంగా

మిత్రుడి కుటుంబానికి చేయూత



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందజేస్తున్న మిత్రులు

మునగాల : మండలంలోని కలకోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996- 2007 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తన మిత్రుడి కుటుంబానికి చేయూతనందించారు. తమ మిత్రుడు ఇటీవల అకాల మరణం పొందడంతో పనస రమేష్, పనస విజయలక్ష్మి ఆధ్వర్యంలో రూ.1.50 లక్షల నగదు సేకరించి మృతుడి పిల్లల పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి శుక్రవారం మృతుడి భార్య గంగాభవానికి డిపాజిట్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పనస విజయ్‌కుమార్, దొడ్డారపు సతీష్, కేత వసంతరావు, పేర్ల వీరబాబు, బాలగంగాధర్, బుర్రి వినోద్, రాచకొండ నగేష్, మండల ఏసుబాబు, షేక్ షబ్బీర్, బుర్రి స్వాతి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు బియ్యం అందజేత

మునగాల : మండలంలోని విజయరాఘవపురంలో మాజీ సర్పంచ్ సొంపంగు సైదులు పెద్ద కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. అదేవిధంగా పగడాల లింగమ్మ అనారోగ్యానికి గురై మృతి చెందారు. వారి దశదినకర్మ సందర్భంగా శుక్రవారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి 50 కేజీల చొప్పున బియ్యం అందజేశారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు కత్తి శ్రీను, గౌరవ అధ్యక్షుడు లింగయ్య, మాజీ ఉపసర్పంచ్ కత్తి కోటయ్య, సభ్యులు కొత్తపల్లి అంజయ్య, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి సొంపంగు రమణయ్య, కొత్తపల్లి సాయిరామ్, కొత్తపల్లి నర్సయ్య, సొంపంగు హరికృష్ణ, శివకృష్ణ, కత్తి నాగబాబు, కత్తి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడి మహోత్సవం



ఇరుముడితో మాలధారులు

హుజూర్‌నగర్ : పట్టణంలో దుర్గాభవాని మాలధారుల ఇరుముడి మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఇరుముడిని తలపై ధరించి విజయవాడకు బయలు దేరి వెళ్లారు. గురుస్వాములు, మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

వాసవీ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన



వాసవీ భవన్‌ను ప్రారంభిస్తున్న మీలా మహదేవ్

సూర్యాపేట : ఆర్యవైశ్యులందరికీ అందుబాటులో ఉండేలా వాసవీ భవన్ నిర్మాణం చేపట్టాలని సుధాకర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీ చైర్మన్ మీలా మహదేవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో వాసవీ భవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వాసవీ భవన్ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వాసవీ భవన్ ట్రస్ట్ అధ్యక్షుడు తోట శ్యాంప్రసాద్ మాట్లాడారు. వాసవీ భవన్ సూర్యాపేట పట్టణంలో సేవా కార్యక్రమాలకు ఒక వేదిక కానుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్య సంఘం అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, వాసవీ భవన్ సెక్రటరీ బిక్కుమల్ల కృష్ణ, ట్రెజరర్ మిర్యాల సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకలు

మిర్యాలగూడ టౌన్ : హిందుత్వం.. ఒక జీవన విధానమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నల్లగొండ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ బంటు జనార్దన్ అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు రోడ్డులో గల రాజా రైస్ మిల్ అపార్ట్‌మెంటులో గురువారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాషాయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయుధ పూజ నిర్వహించి మాట్లాడారు. జాతి నిర్మాణం కోసం ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన భూమికను పోషిస్తుందని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లు పూర్తి చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్ చెరుపల్లి కరుణాకర్, వీరబోమ్మల యాదగిరి, బండారు ప్రసాద్, సుధాకర్, అజయ్, కిశోర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వెండి కిరీటం అందజేత

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని సీతారాంపురం కాలనీలోని శ్రీ వైకుంఠ రామాలయంలో గ్రామానికి చెందిన అర్రెపు సూర్యనారాయణ-స్రవంతి దంపతులు శుక్రవారం సీతమ్మ తల్లి విగ్రహానికి వెండి కిరీటం అందజేశారు. ఈ సందర్భంగా పురోహితులు ఇరువంటి మురళీకృష్ణ శర్మ, విజయకృష్ణ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.